# ముద్దాయిల మానసిక ప్రశాంతతకు యోగ సాధన

### జిల్లా జైలు సూపరింటెండెంట్ రత్నం

**సిద్దిపేట అర్బన్, జూన్ 10, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని కారాగారంలో ముద్దాయిలకు ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతత పెంపొందించడానికి పై అధికారుల ఆదేశాల మేరకు యోగ సాధన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ జి.రత్నం తెలిపారు. బుధవారం జిల్లా జైలు కారాగారంలో యోగ సాధన ప్రారంభించడం జరిగిందన్నారు.ఈనెల 10 నుంచి 21 వరకు యోగ సాధన సమావేశాలు కొనసాగుతాయన్నారు. ముద్దాయిల ఆరోగ్య ప్రయోజనాల నిమిత్తం వారికి రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ముద్దాయిలు,సిబ్బంది అందరూ కలిసి ప్రతి రోజు యోగ సాధన సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 21న ప్రపంచ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ జైలర్ వి.వికాష్, యోగ శిక్షకులు, వార్డెన్ ఆర్.శ్రీనివాస్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



# విత్తన విక్రయ కేంద్రాల టాస్క్‌ఫోర్స్ తనిఖీ

**మర్కుక్, జూన్ 10 (ప్రభాతవార్త):** మండలంలోని పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు వివిధ విత్తన విక్రయ కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన నిల్వలు, లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికలు, విక్రయ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాము, సబ్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, ధృవీకరించబడిన విత్తనాలను విక్ర యించాలని డీలర్లకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విత్తనా లను విక్రయించడంతో పాటు రైతులకు తప్పనిసరిగా బిల్లులు అందజేయా లని తెలిపారు. అనుమతిలేని లేదా నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖల సమన్వయంతో నకిలీవిత్తనాల విక్రయాలను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లు తీసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# గౌరవెల్లి కాలువల భూసేకరణను వేగవంతం చేయాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త :** గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి, రెవెన్యూ అంశాలు, భూసేకరణ పురోగతి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల సంఖ్య పెంపుపై మండల, డివిజనల్ స్థాయి అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలోని మూడు జిల్లాల్లో భూసేకరణకు అవసరమైన నిధులు ఇప్పటికే విడుదలయ్యాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలోఉంచుకుని భూసేకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన భూకేటాయింపుల పురోగతిపై అధికారులను ఆరా తీసిన మంత్రి, టీటీడీ దేవస్థానం, ఇంటిగ్రేటెడ్ ఫిష్‌మార్కెట్, మహిళా బజార్ ఏర్పాటుకు అవసరమైన భూముల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.అలాగే చౌటపల్లి పారిశ్రామిక కారిడార్‌కు సంబంధించిన భూసేకరణ పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు పెంపుపై అన్ని మండలాల ఎంఈఓలు, మూడు జిల్లాల డీఈఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతిగ్రామంలో విస్తృతంగా బడిబాట కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి పెయింటింగ్, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనవంటిపనులను పూర్తిచేయాలని ఆదేశించారు. మండలాల వారీగా విద్యార్థుల నమోదు పెంపునకు లక్ష్యాలను నిర్దేశించుకుని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. విద్యార్థులు ఆకర్షితులయ్యేలా పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, డీఈఓలు, ఎమ్మార్వోలు, ఎంఈఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలి

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

**గుమ్మడిదల జూన్ 10 ప్రభాతవార్త :** గుమ్మడిదల పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్ పరిసరాలు, సిబ్బందిబ్యారెక్స్ పరిశుభ్రతను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించగలమని, అందుకు సిబ్బంది ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక (ప్లాన్ ఆఫ్ యాక్షన్) ఉండాలన్నారు. నిర్ణీత గడువులోగా ప్రతి రికార్డ్‌ను సిసిటిఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించడం జరిగింది. తరచూ వాహనాల తనిఖీలు, నాకాబందీ వంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అనుమానిత వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచాలని సూచించారు. పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తుల వివరాలు సిబ్బంది తెలుసుకొని ఉండాలని, పగలురాత్రి బీట్‌లలో క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ ఆన్‌లైన్ రికార్డుల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. మనచుట్టూ జరుగుతున్న వివిధ రకాల నేరాలు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించడం జరిగింది.

సిబ్బందిని ఉద్దేశించి మాట్లా డుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని, తమకు కేటాయిం చిన విధులను పూర్తి బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓపికగా విని సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో గానీ, వ్యక్తిగతంగాగానీ ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత అధికారుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ తనిఖీలో పటాన్చెర్వు డిఎస్పీ ప్రభాకర్, జిన్నారం సిఐ రమణ రెడ్డి, గుమ్మడిదల ఎస్‌హెచ్‌వో లక్ష్మీ శ్రీకాంత్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నాడి మల్లారెడ్డికి చాడ వెంకటరెడ్డి నివాళి

**బెజ్జంకి, జూన్ 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు అన్నాడి మల్లారెడ్డి మరణించగా ఆయన మృతదేహానికి బుధవారం సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లారెడ్డి సీపీఐ పార్టీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీకి ఎనలేని సేవాలందించారని తెలిపారు. పేద ప్రజల పక్షనా పోరాటం చేసిన వ్యక్తి అని ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట,కరీంనగర్ జిల్లాల సీపీఐ ప్రతినిధులు మంద పవన్,పంజాల శ్రీనివాస్, మర్రి వెంకటస్వామి, పోతిరెడ్డి వెంకట్‌రెడినడ, పొనగంటి కేదారీ,బోయిని అశోక్, సృజన్‌కుమార్, న్యాలపట్ల రాజు, గూడెం లక్ష్మీ, బోనగిరి రూపేష్, బోనగిరి మహేందర్, సంగెం మధు, గడిపే మల్లేష్, పద్మ, అంబేద్కర్ సంఘం నాయకులు పొట్టపెల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గమ్యస్థానం ముఖ్యం..అంతకంటే ప్రాణం ముఖ్యం

### అదనపు డిజిపి మహేష్ మురళీధర్ భగవత్



మాట్లాడుతున్న అదనపు డిజిపి మహేష్ మురళీధర్ భగవత్

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 10 ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఫసల్వాడి గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభకు రాష్ట్ర అదనపు డిజిపి (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ మురళీధర్ భగవత్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చిన్న మొబైల్ ఫోన్ కొనుగోలు చేస్తేనే స్క్రీన్ గార్డ్ వేయిస్తామని, మొబైల్ కంటే మన ప్రాణాలు ఎంతో విలువైనవని గుర్తించాలని సూచించారు. కార్లలో ప్రయాణించేటప్పుడు డ్రైవర్ మాత్రమే కాకుండా ప్రయాణికులు సీటు బెల్ట్ ధరించాలని చెప్పారు. అలాగే మద్యం తాగి వాహనం నడపొద్దన్నారు. పండుగలకు అల్లుళ్లకు కొత్త దుస్తులు బహుమతిగా ఇచ్చే సంప్రదాయం తెలంగాణ ప్రజలదని, దుస్తులు కాకుండా వారి ప్రాణరక్షణకు ఉపయోగపడే హెల్మెట్‌ను బహుమతిగా ఇస్తే మరింత మంచిదని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, 'ఆరైవ్ అలైవ్' అంటే మన ప్రయాణం సురక్షితంగా సాగి, గమ్యస్థానానికి క్షేమంగా చేరుకోవడం అని అన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు అదనపు డీజీపీ మహేష్ మురళీధర్ భగవత్, ఫసల్వాడి గ్రామానికి రావడం 'ఆరైవ్ అలైవ్'కు ప్రాధాన్యతను తెలియజేస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో అనేకులు ప్రాణాలు కోల్పోతున్నారని, అందుకు ముఖ్య కారణం ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడమేనని అన్నారు. ప్రతి వాహనదారుడు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించి, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి, పరిమిత వేగంతో ప్రయాణించాలని సూచించారు. ఫసల్వాడి గ్రామ సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ, ఈ సభ వేదికగా ఈ రోజు నుంచి హెల్మెట్, సీటు బెల్ట్ ధరించనిదే గ్రామంలోకి ఎవరికీ అనుమతి లేదని తీర్మానం చేసుకుంటున్నట్లు తెలిపారు. 'నో హెల్మెట్ నో ఎంట్రీ' విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, డీఎంహెచ్‌వో లలిత, ఆర్డీవో రాజేందర్, రవాణా శాఖ జాయింట్ కమిషనర్ వెంకటరమణ, డీఎస్పీ సత్యయ్యగౌడ్, జిల్లా పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# పారదర్శకంగా నీట్ పరీక్ష నిర్వహించాలి

### సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు




మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ పాండు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూన్ 10, ప్రభాతవార్త** జిల్లాలో నిర్వహించనున్న నీట్ (నీట్ యూజీ) పరీక్షను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అడిషనల్ కలెక్టర్ పాండు ఆదేశించారు. జూన్ 21న మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,924 మంది అభ్యర్థులు నీట్ పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమలు చేయడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల పనితీరు, తాగునీటి సదుపాయం,పారిశుధ్య నిర్వహణ, ఫర్నిచర్, లైటింగ్ తదితర ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని సూచించారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. పరీక్ష నిర్వహించే రోజు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను తాత్కాలికంగా మూసివేయించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు అవసరమైన మేరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నీట్‌వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన జాతీయ స్థాయి పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షకుసంబంధించిన మార్గదర్శకాలను పూర్తిగా చదివి, హాల్ టికెట్‌లో పేర్కొన్న సమయానికి ముందుగానే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అమలులోఉన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిషేధిత వస్తువులు తీసుకురావద్దని సూచించారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారి(ఎన్‌టిఏ) భారతీదేవి , జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, ఆర్టీసీ, విద్యుత్, పోస్టల్ , రెవెన్యూ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డబ్బాతో మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

### ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్రిక్తత... సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ

**నర్సాపూర్, జూన్ 10, ప్రభాతవార్త :** తన భూమి హద్దులు చూపించడం లేదంటూ ఓ మహిళా రైతు పెట్రోల్ డబ్బాతో ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట మహిళా రైతు వీరమణి పెట్రోల్ డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు ప్రయత్నించింది. శివంపేట్ మండలంలోని దొంతి గ్రామంలో 234 సర్వే నంబర్లో ఉన్న 1.21 గుంటల భూమిని రెండేళ్లుగా తన భూమికి సంబంధించిన సర్వే నిర్వహించినప్పటికీ అధికారులు తన భూమి హద్దులను స్పష్టంగా చూపించడం లేదని ఆమె ఆరోపించింది. తమ భూమిపై కన్నేసిన బడాబాబులు, రెవెన్యూ అధికారులు భూమి హద్దులు చూపించకుండా అడ్డు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ చర్యకు దిగినట్లు ఆమె తెలిపింది. ఇది గమనించిన రెవెన్యూ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని ఆమె దగ్గర నుండి పెట్రోల్ డబ్బా తీసుకొని మహిళా రైతుతో అధికారులు మాట్లాడి ఆమె సమస్యపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మహిళా రైతు

ఈ ఘటనతో ఆర్డీవో కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మహిళా రైతు భూమి వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. త్వరలో సర్వే చేసి మహిళా రైతు భూమి హద్దులు చూపిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# బలం, బలగం ప్రదర్శనకేనా బర్త్‌డే వేడుకలు..!

### ఇరుపార్టీల నాయకుల సమీకరణ..!..అసమ్మతి నేతలను చేరదీస్తూ బలగం పెంపు..! నియోజకవర్గంలో చక్రం తిప్పుతున్న కంఠారెడ్డి ..!

**పాపన్నపేట, జూన్ 10, ప్రభాతవార్త** మెదక్ నియోజకవర్గ రాజకీయాల్లో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలు ఈసారి రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సాధారణంగా అభిమానులు, కార్యకర్తలతో జరిగే పుట్టినరోజు వేడుకలు ఈసారి రాజకీయ సమీకరణాలకు వేదికగా మారాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. బుధవారం ఏడుపాయలలో నిర్వహించిన బోనాల కార్యక్రమం, జన్మదిన వేడుకలకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.కార్యక్రమానికి హాజరుకావాలని ముందుగానే గ్రామ గ్రామాన నాయకులకు ప్రత్యేక ఆహ్వానాలు అందినట్లు సమాచారం.నియోజకవర్గంలోని పలు గ్రామాలు, మండల కేంద్రాల్లో జన్మదిన వేడుకల ఏర్పాట్లు భారీగా నిర్వహించడంతో రాజకీయ వాతావరణం నెలకొంది. ఇటీవల కాలంలో వివిధ పార్టీల్లో అసంతృప్తితో ఉన్న నాయకులు, ద్వితీయ శ్రేణి నేతలు, స్థానికంగా ప్రభావం కలిగిన వ్యక్తులతో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి వరుసగా సంప్రదింపులు జరుపుతున్నారన్న ప్రచారం సాగుతోంది. కొందరికి స్వయంగా ఫోన్‌చేసి కార్యక్రమానికి ఆహ్వానించినట్లు ఆయన అనుచర వర్గం చెబుతోంది. దీంతో ఈవేడుకలు కేవలం జన్మదిన కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాజకీయ బలప్రదర్శనగా మారాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ నాయకులు, యువ నేతలతో సమావేశమవుతూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్న కంఠారెడ్డి, భవిష్యత్ రాజకీయ వ్యూహాలకు అనుగుణంగా తన బలగాన్ని విస్తరించుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్న చర్చకూడా సాగుతోంది. ఈ నేపథ్యంలో జన్మదిన వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు హాజరుకావడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా పాల్గొనాలని పిలుపునివ్వడంతో ముందుగానే గ్రామాలవారీగా సమావేశాలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అభిమాన సంఘాలు, అనుచరులు కృషి చేసినట్లు తెలుస్తోంది.

కార్యక్రమానికి వచ్చిన జన సందోహం, నాయకుల హాజరు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ప్రస్తుతం మెదక్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న తరుణంలో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి చేప డుతున్న ఈ చర్యలు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఒకే వేదికపై కనిపించడం, పలువురు అసమ్మతినేతలు ఆయనకు చేరువవుతున్నారన్న ప్రచారం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి నియోజక వర్గ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డికి కంఠరెడ్డి తిరుపతిరెడ్డి ఎదుగుదల సవాలుగా మారిందన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. గతంలో ఆమెకు అండగా నిలిచిన జిల్లా, నామినేటెడ్ పదవులుపొందిన పలువురు ప్రథమ, ద్వితీయ శ్రేణి నాయకులు ప్రస్తుతం కంఠ రెడ్డి వైపు మొగ్గుచూపుతున్నారన్న ప్రచారం సాగు తోంది. కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్‌లో చేరిన తర్వాత కంఠరెడ్డి తిరుపతిరెడ్డి తన రాజకీయ ప్రాబల్యాన్ని క్రమంగా విస్తరించుకుంటున్నారని, దీనివల్ల నియోజకవర్గ రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

అయితే ఈ జన్మదిన వేడుకలు నిజంగానే రాజకీయ బలం, బలగం నిరూపణగా నిలుస్తాయా లేక సాధారణ వేడుకలుగానే ముగుస్తాయా అన్నది ఇప్పుడు మెదక్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాబోయే ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు ఎలాంటి ప్రభావం చూపుతాయోనని నియోజక వర్గంలో తీవ్రస్థాయి చర్చలకు తావిచ్చింది.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్ రావు

# బుల్లెట్ ట్రైన్ సాధించే వరకు పోరాటం

### మాజీ ఎంపీ బీబీ పాటిల్,ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్ జూన్ 10 ప్రభాతవార్త :** జహీరాబాద్ మీదుగా మంజూరైన హైదరాబాద్ ముంబై బులెట్ ట్రైన్ మధ్యంతరంగా వయా వికారాబాద్ మీదుగా నడపాలని రైల్వే అధికారులు డిపిఆర్లు తయారు చేయడానికి నిరసిస్తూ బుధవారం ఎమ్మెల్యే మాణిక్యరావు ఆధ్వర్యంలో స్థానిక అతిథి వోటర్లు హాల్ పార్టీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బిజెపి జాతీయ నాయకులు బీబీ పాటిల్ తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలో జహీరాబాద్ మీదుగా హైదరాబాద్. ముంబై బుల్లెట్ ట్రైన్ మంజూరు చేయించాలని. ఆ తర్వాత అట్టి బుల్లెట్ ట్రైన్ వికారాబాద్ మీదుగా తరలిస్తున్నట్టు డిపిఆర్‌లు తయారు చేసినట్లు వార్తలు వస్తున్నాయని, జహీరాబాద్ ప్రాంతం రాబోయే రోజులలో నింజు కంపెనీలతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, ఇక్కడ పనిచేసే ఉద్యోగస్తులకు కార్మికులకు ఇతర వర్గాలకు రవాణా సౌకర్యాలకు బుల్లెట్ ట్రైన్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ విషయంలో తాను కేంద్ర రైల్వే శాఖ మంత్రితో పాటు అధికారులతో మాట్లాడి బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ మీదుగా వెళ్లే విధంగా ప్రయత్నిస్తానని అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన కొరకు రాజకీయ పార్టీల కతీతంగా అందరం కలిసి పోరాడి బుల్లెట్ ట్రైన్ సాధించుకున్నంత వరకు కృషి చేద్దామన్నారు. ఎమ్మెల్యే మాణిక్యరావు మాట్లాడుతూ జహీరాబాద్ మీదుగా మంజూరైన హైదరాబాద్ ముంబై బుల్లెట్ ట్రైన్ కొందరి స్వార్థంవల్ల వయా వికారాబాద్ మీదుగా మళ్లించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆప్రయత్నాలను పార్టీలకతీతంగా తిప్పి కొట్టి బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ మీదుగా వెళ్లే విధంగా పోరాడుదాం అన్నారు.

# కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

**పాపన్నపేట, జూన్ 10, ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని పొడ్చెన్‌పల్లి గిరిజన తండాలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటింబీకుల సమాచారం మేరకు వివరాలు ఇలాఉన్నాయి. పొడ్చెన్‌పల్లి గ్రామానికి చెందిన కేతావత్ శ్రీను నాయక్(28) ఒక ప్రైవేటు పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అదే గ్రామానికి చెందిన కేతావత్ నిఖితతో ఐదు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు మగపిల్లలు. కాగా కొద్ది కాలంగా ఆర్థిక ఇబ్బందులతో తలెత్తడంతో తరుచూ భార్యభర్తల మధ్య గొడవజరుగుతుండేదని మంగళ వారం మృతుడు విధులు ముగించుకొని ఇంటికి రాగ భార్యతో గొడవ జరిగింది. ఈ విషయమై మృతుడు గ్రామ పెద్దల వద్ద చెప్పడంతో గ్రామ పెద్దలు ఇరువురిని పిలిపించి నచ్చజేప్పి పంపించి వేశారు. అయితే సాయంత్రం మళ్లీ భార్య, భర్తల మధ్య గొడవ చోటుచేసుకోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన మృతుడు చస్తేనే సమస్యకు పరిష్కారం అంటూ ఇంటి నుండి బయటకు వెళ్లి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మృతుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరేసుకున్న మృతుడిని గుర్తించి వెంటనే కిందకు దింపి మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షి ంచి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తల్లి దేవ్లీ పాపన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటింబీకులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కాగా మృతుడికి తల్లి దేవ్లీ, భార్య నిఖిత, ఇరువురు కుమారులు ఉన్నారు.

# బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరు దుర్మరణం

**చౌటకూరు, జూన్ 10,ప్రభాతవార్త:** మండలపరిధిలోని న్యూ హున్నాపూర్ గ్రామ సమీపంలో 161వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అందోలు మండలం డాకూరు గ్రామానికి చెందిన మహమ్మద్ అద్నాన్ (29) తన మోటారు సైకిల్‌పై సంగారెడ్డి వైపు వెళుతున్న క్రమంలో హైద్రాబాద్ నగరానికి చెందిన కుటుంబ సభ్యులు టీఎస్ 11 ఈడీ 3747 కారులో మెదక్ చర్చిని దర్శించుకునేందుకు వెళుతుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన అద్నాన్ మోటారు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో అద్నాన్ తీవ్రంగా గాయపడటంతో ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు అద్నాన్ మిషన్ భగీరథ పథకంలో కాంట్రాక్టు కార్మికుడిగా అందోలు మండలం రోళ్లపాడు, మన్‌సాన్‌పల్లి గ్రామాల లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అద్నాన్ మృతిపట్ల సహచర కార్మికులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందచేసినట్లు ఎస్సై నల్లా విశ్వజన్ పేర్కొన్నారు.

# గుడుంబా తయారీ స్థావరాలపై పోలీసుల దాడి

**బెజ్జంకి, జూన్ 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చీలాపూర్‌పల్లి పరిసర గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారీ జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో గుడుంబా తయారీకి ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు 10 లీటర్ల గుడుంబా, 10 కిలోల బెల్లం, 2 కిలల పటికతో పాటు తయారీ పరికరాలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం తయారీ విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగిస్తామని పోలీసులు హెచ్చరించారు.

# యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

**చిన్నశంకరంపేట, జూన్ 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శాలిపేట గ్రామానికి చెందిన యవకుడు అదృశ్యమైనట్లు బుధవారం ఫిర్యాదు అందడంతో చిన్నశంకరంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం... శాలిపేట గ్రామానికి చెందిన రమేష్ పుష్పలు భార్యాభర్తలు. కాగా వారు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ప్రశాంత్, మురళి. పట్టణంలోని ఒక ప్రవేటు పరిశ్రమలో పనిచేసుకుంటున్నారు. కాగా మంగళ వారం రాత్రి పెద్ద కుమారుడు ప్రశాంత్ స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ప్రతి రోజు ఇంటి పైన పడుకుంటాడు. దీంతో కుటుంబసభ్యులు అతడికి ఫోన్ చేయలేదు. ఉదయం ప్రశాంత్‌ను నిద్రలేపడానికి తండ్రి రమేష్ పైకి వెళ్లిచూడగా అతడు కనిపించలేదు. అంతేగాదు అతని బైక్ కూడా కనిపించలేదు. బంధువుల వద్ద, తెలిసిన వారి ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పట్టణంలో కొనసాగుతున్న వార్డుసభలు

-పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

మెదక్, జూన్ 10, ప్రభాతవార్త:

ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో నిర్వహించిన వార్డు సభలలో మున్సిపల్ చైర్మన్ ఎండి యూనుస్, కమిషనర్ జి.ప్రభాకర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎండి యూనుస్ మాట్లాడుతూ వార్డులలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు, ఈ సందర్భంగా ఆయా వార్డుల ప్రజలు మంచినీరు డ్రైనేజీ వ్యవస్థ తదితర సమస్యలపై చైర్మనుకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖండేమ్ నరసింహులు, మాజీ ఎంపిటిసి గుండాల అశోక్, ఆయా వార్డుల కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి అంకితభావంతో కృషిచేస్తా

-సర్పంచ్ తులసి సత్యనారాయణ

సదాశివపేట, జూన్ 10, ప్రభాతవార్త:

గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తూ, గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండి సేవలందిస్తానని సర్పంచ్ తులసిసత్యనారాయణ అన్నారు. బుధవారం ప్రజాపాలన ప్రగతిప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. యువకులు ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన ఆర్‌సీతో పాటు ఇతరపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈసందర్భంగా సర్పంచ్ తులసిసత్యనారాయణ మాట్లాడుతూ గ్రామసభలో వృద్ధాప్య పెన్షన్ల కోసం 113 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 13 దరఖాస్తులు అందాయని, వాటిపరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సామల గోపాల్, శైలేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, డాక్టర్ మనీషారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డుసభ్యులు అనంతకృష్ణ, నరసమ్మ, నల్ల బాలయ్య, శేఖర్ పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

సదాశివపేట, జూన్ 10, ప్రభాతవార్త:

సదాశివపేట పట్టణంలోని 19వ వార్డులో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మనుపల్లి అంజమ్మసత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శివాజీ హాజరయ్యారు. ఈసందర్భంగా 19వవార్డు కౌన్సిలర్ పట్లూరి రోజానాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిపథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ మ్యాపింగ్‌ను ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే మహిళలకు ఇందిరమ్మచీరలు పంపిణీచేయడం జరిగిందన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను ప్రజలు తమదృష్టికి తీసుకొస్తే ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వపథకాల అమలుపై చర్చించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లూరి నాగరాజుగౌడ్, ఆకుల శోభాఆర్పేలు, ఓబీలు, వార్డుప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వార్డు ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూస్తా..

-కౌన్సిలర్ గారెల గౌరీదేవి తుల్జారాం

సదాశివపేట, జూన్ 10, ప్రభాతవార్త:

ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు వార్డ్ కౌన్సిలర్ గారెల గౌరీదేవి తుల్జారం బుధవారం రాఘవేంద్రనగర్ కాలనీ 22వ వార్డు లో డాక్టర్ సాబ్ ఇంటి దగ్గరలో ఉన్న 30 ఫీట్ల రోడ్డు ప్రక్కన ప్రభుత్వం నిధులతో నీటి బోరువేయించి మోటార్‌బిగించి ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు అభివృద్ధితో పాటు ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండి తన వంతు నిస్వార్థసేవలు అందిస్తామన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేకదృష్టి సారించి పెద్దలు జగ్గారెడ్డి, నిర్మలాజగ్గారెడ్డి సహాయసహకారాలతో వార్డును అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, మెకానిక్ సోదరులు కాలనీవాసులు చోటు (సలీం) ఇబ్రహీం ఖలీల్, రఫీ పాల్గొన్నారు.

## గ్రామసభలో అభివృద్ధి పనులపై చర్చ

మొగుడంపల్లి, జూన్ 10, ప్రభాతవార్త:

మొగుడంపల్లి మండల కేంద్రంలో బుధవారం సర్పంచ్ రాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా జరిగిన సభలో వర్షాకాల జాగ్రత్తలు, మంచినీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై చర్చించారు. ఉపాధిహామీ పనులు, నూతన పింఛన్లు, రోడ్డుభద్రత అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన సమస్యలు, అవసరాలపై ప్రజల అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జుబేర్, పంచాయతీ కార్యదర్శి మారుతి, వివిధశాఖల అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో పైతార గ్రామాభివృద్ధి

-సర్పంచ్ రవితేజరెడ్డి

కొల్చారం, జూన్ 10 (ప్రభాతవార్త):

మెదక్‌జిల్లా కొల్చారంమండలం పైతారగ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసర్పంచ్, మండలసర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాబన్న గారి రవితేజరెడ్డి అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను గ్రామస్థులకు వివరించారు. అనంతరం వివిధ అంశాలపై గ్రామ ప్రజలతో చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవితేజరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పచ్చదనం పెంపు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదని, చెత్తను తగలబెట్టకూడదని ప్రజలకు సూచించారు. గ్రామ ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే పైతార గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వార్డుసభ్యులు రాజాగౌడ్, ఆంజనేయులు, మల్లేశం, జీవయ్యతోపాటు గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 88 మందికి చెక్కుల పంపిణీ

పుల్‌కల్, జూన్ 10, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 88 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం అందచేశారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆత్మకమిటి చైర్మన్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లన్నగారి దుర్గారెడ్డి, డిసిసిబి మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డిలతో కలిసి 88మందికి 88.10 లక్షల రూపాయల చెక్కులను అందచేశారు. పలువురికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను సైతం అందచేశారు. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న పేదల కుటుంబాలకు ఈ పథకం బహు ఉపయోగకరంగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, సర్పంచులు కంది కంటి శ్రీనివాస్‌ముదిరాజ్, పట్లోళ్ల భూంరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, గోవర్ధన్, తలారి అంజయ్య, బోయిని శ్రీనివాస్, ఉదయ్ పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఏఈవో

నిజాంపేట్, జూన్ 10, ప్రభాతవార్త:

నిజాంపేట్ మండల వ్యవసాయ అధికారిగా నిఖిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అవుట్‌సోర్సింగ్‌లో ఉన్న ఏఈవో లక్ష్మీకాంత్ బదిలీపై వెళ్లడంతో ఆమె కొత్తగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు సకాలంలో అందేలా కృషిచేస్తానని తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు సహకరించాలని ఆమె కోరారు.

# రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు

-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

-కొనుగోలుప్రక్రియ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలప్రకారం జరుగుతుంది

మెదక్, జూన్ 10, ప్రభాతవార్త:

మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, యూరియా నిల్వలపై జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ మెదక్ జిల్లాలో యాసంగి 2025-26 ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నిరంతరాయంగా కొనసాగుతుందని, ప్రస్తుత యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరగడం వల్ల ఇప్పటి వరకు 3.90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడిందన్నారు. ధాన్యం రాక అధికంగా ఉండటం వల్ల రవాణా, అన్‌లోడింగ్, నిల్వల నిర్వహణపై అదనపు ఒత్తిడి ఏర్పడినప్పటికీ, కొనుగోలు ప్రక్రియ ఎక్కడా నిలిచిపోలేదని స్పష్టంచేశారు. ధాన్యంరాక గణనీయంగా పెరిగినందున జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో సివిల్‌సప్లైస్, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షాల కారణంగా కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవడం, రవాణాలో స్వల్ప అంతరాయాలు ఏర్పడినప్పటికీ రైతులకు నష్టంకలగకుండా అవసరమైన వసతులు కల్పించబడినాయని, తడిసిన ధాన్యం విషయంలో కూడా రైతులు ఎలాంటి ఆందోళనకు లేదా అధైర్యానికి గురికావలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టంచేశారు. మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వేగవంతంగా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయినట్లు లేదా రైతుల ధాన్యం కొనుగోలు చేయబడదనే విధంగా జరుగుతున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమైనదని స్పష్టంచేస్తున్నామన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, అధైర్యపడకుండా కొనుగోలు ప్రక్రియపై విశ్వాసంతో ఉండాలన్నారు. జిల్లాలోని 6, 515 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఎక్కడ కూడా కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్నిప్రాంతాలకు నిల్వలను చేరవేస్తున్నామని తెలిపారు. పక్కాగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని, స్టాక్ పాయింట్లకు ఎరువులనిల్వలు చేరవేశామని కలెక్టర్ వివరించారు. మోతాదుకుమించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాల్లో పర్యవేక్షణకోసం 24టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరతరం తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. కొల్చారంలోని మల్లిఖార్జున ఎరువుల దుకాణానికి స్టాప్ సేల్స్ విషయంలో నోటీసులు జారీచేశామని కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు.

## ఖాళీ కుర్చీలతో వార్డుసభ..



ప్రజలు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

గుమ్మడిదల, జూన్ 10, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 11, 12, 13, 14, 15 వార్డుల్లో వార్డుసభలను మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్పీ ప్రభాకర్, పాల్గొన్నారు, తహసీల్దార్ పరమేశం, మున్సిపల్‌చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్‌చైర్మన్ సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు మూడు చింతల నరేందర్‌రెడ్డి, మాధవి, పద్మ, ప్రమీల, కత్తుల రమేష్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజుద్దీన్, ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి, మండలవైద్యాధికారి మధుకర్, విద్యుత్‌శాఖ అధికారి రవీందర్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు. అయితే ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను రూపొందించాల్సిన వార్డుసభలు ప్రజల హాజరులేక వెలవెలబోయాయి. వార్డుప్రజలకు సరైన సమాచారం అందించకపోవడం, సభలపై ముందస్తు అవగాహన కల్పించకపోవడం వల్లే ఈపరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో అమలు చేస్తున్న 99రోజుల ప్రణాళిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఉద్దేశించినప్పటికీ, గుమ్మడిదలలో నిర్వహించిన వార్డుసభలు మాత్రం తూతూమంత్రంగా ముగిశాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలే లేని సభల్లో ప్రజాసమస్యలపై చర్చలు జరగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరైనప్పటికీ, ప్రజల భాగస్వామ్యం లేకపోవడం వల్ల సభల అసలు ఉద్దేశం నీరుగారిపోయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా మున్సిపల్ యంత్రాంగం ప్రజలకు ముందస్తు సమాచారం అందించి, వార్డుసభలను ప్రజావేదికగా మార్చాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

## సైనిక్ భవన్‌కు 250 గజాల స్థలం కేటాయింపు

-మాజీ సైనికుల హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

సంగారెడ్డి, జూన్ 10, ప్రభాతవార్త:

సంగారెడ్డి జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో త్రివిధ దళాల మాజీ సైనికుల సమావేశం మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హైదరాబాద్ సైనిక ప్రాంతానికి చెందిన బ్రిగేడియర్ ఎన్.ఎస్. బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి శ్రీనివాస్, బోర్డు సూపరింటెండెంట్ సరస్వతి, సైనిక్‌బోర్డు సభ్యులు తోపాజీ అనంతకిషన్, కూన వేణుగోపాల్, మాజీ సైనికుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో మాజీ సైనికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను బ్రిగేడియర్ ఎన్.ఎస్.బాబు ఆలకించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే సంగారెడ్డిలో సైనిక్ భవన్ నిర్మాణం కోసం 250 గజాల స్థలాన్ని కేటాయించడం పట్ల మాజీ సైనికులు హర్షం వ్యక్తంచేశారు. ఈస్థలం కేటాయింపునకు కృషిచేసిన జాగారెడ్డికి, అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ సైనికులందరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సైనిక్ భవన్ ఏర్పాటుతో జిల్లాలోని మాజీ సైనికులకు మరింత మెరుగైనసేవలు అందుబాటులోకి వస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వటపత్రి సాయి, దశరథ్, శంకర్ తదితర మాజీ సైనికులు పాల్గొన్నారు.

## నూతన చర్చ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్



నూతన చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్యరావు

జహీరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:

కోహీర్‌మండలం మాచిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన మెథడిస్ట్ చర్చ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తంలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్‌లు గుండప్ప, రామకృష్ణారెడ్డి, మొగుడంపల్లి మండలపార్టీ అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, ముర్తుజా, సర్పంచ్ పరమేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ పేరున ప్రత్యేక పూజలు

నర్సాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

నరేంద్ర మోడీ 12 సంవత్సరాలు అత్యధిక రోజులు ప్రధానమంత్రిగా పరిపాలించిన నేపథ్యంలో బుధవారం నర్సాపూర్ బస్టాండ్ హనుమాన్ ఆలయంలో నర్సాపూర్ బిజెపినాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, మహా అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రపంచస్థాయిలో భారతదేశాన్ని ప్రపంచంలో విశ్వ గురువుగా ఒక గొప్ప సంకల్పంతో ముందుకు తీసుకువెళుతున్నందుకు మోడీ ఆయుష్షు, ఆరోగ్యం బాగుండాలని ఇంకా ఎక్కువ సంవత్సరాలు ప్రధానమంత్రిగా పనిచేయాలని భగవంతుని వేడుకున్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్, సీనియర్ జిల్లా నాయకులు పెద్ద రమేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు నిరుడి చందయ్యా, కౌన్సిలర్ నిరంజన్‌దాస్, జిల్లాకార్యదర్శి బాలరాజు, జిల్లా కోశాధికారి ఆంజనేయులుగౌడ్, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములునాయక్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షులు రాణి, పట్టణ ప్రధాన కార్యదర్శి సంగసాని రాజు, బిజెపి నాయకులు రాజిరెడ్డి, చారి, దిగంబర్, బూత్ అధ్యక్షులు బాలేష్, ఓంకార్, శ్రీనివాస్, కుమార్, ఆకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

-సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్



మొక్కలను నాటిన దృశ్యం

కొల్చారం, జూన్ 10, ప్రభాతవార్త:

కొల్చారం రాంపూర్ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్ తెలిపారు. బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సభ ఏర్పాటుచేశారు. ఫారెస్ట్ పోలీస్ అంగన్‌వాడీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలపై సర్పంచ్ సంగమేశ్వర్ గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తడి పొడి చెత్త పారిశుధ్యం సమస్యలు లేకుండా అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే గ్రామసభ ఏర్పాటు చేశామని, అందులో వారి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాలలో పెద్దమ్మ ఆలయం వద్ద డ్రైనేజ్ తాగునీరు సమస్య త్వరలో పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. అడవిని ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టరీత్యాచర్యలు తీసుకుంటామని సూచించారు. ఏఈఓ నిరోషా మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా రైతులకు సాగు చేసేందుకు సబ్సిడీ ద్వారా విత్తనాలతో పాటు పరికరాలు అందించడం జరుగుతుందని సూచించారు. అలాగే ఎస్సై మోహినోద్దీన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరు హెల్మెట్లు ధరించారని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, వార్డుసభ్యులు, ఉపసర్పంచ్ పాల్గొన్నారు.

# అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదాలు

-అడిషనల్ డిజి సంజయ్‌కుమార్ జైన్

మెదక్, జూన్ 10చ ప్రభాతవార్త:

మెదక్ ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసభలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, పరిసరాలపరిశుభ్రత, అవగాహన కార్యక్రమం నిర్వహించి పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, పౌరులతో కలిసి రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించడం జరిగింది, అనంతరం పౌరులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ అవగాహన ర్యాలీ, సదస్సుకు జిల్లా కలక్టర్ ప్రతిమాసింగ్, అడిషనల్ డిజి సంజయ్‌కుమార్ జైన్, ఎస్పీ శ్రీనివాస్‌రావు హాజరై కార్యక్రమాలను ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అడిషనల్ డిజి సంజయ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో, రోడ్డుప్రమాద మరణాలు సంభవించకుండా పోలీస్, రోడ్డు ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, ఇతరశాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రోడ్డుప్రమాద క్షతగాత్రులను కాపాడి సహాయ సహకారాలు అందిస్తే రహవీర్‌గా గుర్తింపు వస్తుంది అన్నారు, రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు జాగ్రతగా అవగాహనతో వాహనాలు నడపాలని, పోలీసుశాఖ అనుక్షణం అవగాహన కల్పిస్తూ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తుందని అన్నారు. బస్సులు, ఇతరవాహనాలు కండిషన్‌లో లేకుంటే సీజ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రోడ్డుభద్రత ప్రతిజ్ఞచేశారు. పోలీసు కళాబృందం వారు పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, రవాణాశాఖ అధికారి శ్రీకాంత్‌చక్రవర్తి, తూప్రాన్ ఆర్డీవో బావయ్య పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజల దృశ్యం

## యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం..

-నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 10, ప్రభాతవార్త:

యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి,వారికి సరైన ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభకు పట్టాభిషేకం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు నిర్వహించే వ్యక్తిత్వ వికాస, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు మరిన్ని మంచి అవకాశాలు కల్పించేందుకు త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో మరోసారి భారీ జాబ్ మేళాను నిర్వహిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఈ వేదికగా ప్రకటించారు. స్థానికయువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో తన సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నగేష్‌కుమార్ శెట్కార్, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ శ్రీశైలం, మున్సిపల్ కౌన్సిలర్లు, తాహెర్ అలీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, రమేష్ చౌహన్, పండరిరెడ్డి మాజీ ఎంపిటిసి, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బివిఆర్ఐటిలో ఘనంగా అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సు ప్రారంభిస్తున్న చీఫ్ ఇంజనీర్ ఫిల్ వెనిజియా

నర్సాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

నర్సాపూర్ పట్టణసమీపంలోని బివిఆర్ఐటి కళాశాలలో ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నాస్ అండ్ మైక్రోవేవ్ (వామ్స 2026) సదస్సు బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో జూన్ 10 నుంచి 13 వరకు నాలుగు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించబడుతోంది. సదస్సుకు ముఖ్యఅతిథిగా అమెరికాకు చెందిన లింట్రిస్ సంస్థ చీఫ్ ఇంజనీర్ ఫిల్ వెనిజియా హాజరయ్యారు. శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షులు రవిచంద్రన్ రాజగోపాల్, కార్యదర్శి ఆదిత్య విస్సం, ఫిల్ వెనిజియా అధికారికంగా ప్రారంభించారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు. వారిలో ఫిల్ వెనిజియా, డా.ధవల్ పుజారా, ప్రొ.అనంతభారతి, డా.సుధాకర్ కె. రావు, డా.సి.జె.రెడ్డి, ప్రొ.క్రిస్టోఫ్ ఫ్యూమాక్స్, ప్రొ.ఫ్రాన్సెస్కో పి. ఆంద్రియుల్లీ, వి.సమీర్‌చక్రవర్తి, డా.పి.ఎస్ఆర్‌చౌదరి, డా.కె.లక్ష్మీప్రసాద్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, బీవీఆర్ఐటీ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నచింతకుంటలో హైమాస్ట్ లైట్‌ల ఏర్పాటు

నర్సాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామ సర్పంచ్ ప్యాట సరిత మహేష్ ఆధ్వర్యంలో నర్సాపూర్ మెదక్ హైవేపై చిన్నచింతకుంట బస్ స్టేజివద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేశారు. ఈ హైమాస్ట్ లైట్‌ల ఏర్పాటుతో బాటసారులకు గ్రామ ప్రజలకు ఎంతో సౌకర్యం కలిగింది. హైమాస్ట్ లైట్ వద్ద ఏర్పాటు చేయడం పట్ల గ్రామ సర్పంచ్ ప్యాట సరిత మహేష్ గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంటయ్య వార్డుసభ్యులు మహేష్, గ్రామస్థులు శివయ్య, నరసింహారెడ్డి, కృష్ణ, నరహరి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టేక్మాల్‌లో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

టేక్మాల్, జూన్ 10, ప్రభాతవార్త:

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని టేక్మాల్ మండల తహసీల్దార్ తులసిరాం, మండలపార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ కృషితో టేక్మాల్ మండలానికి 41కళ్యాణలక్ష్మి, 39 సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు అయ్యాయన్నారు. బుధవారం టేక్మాల్ మండల కేంద్రంలోని స్థానిక రైతువేదికలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రజాపాలన కొనసాగుతుందని, మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో ఆందోల్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో టేక్మల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సుధాకర్, జోగిపేట మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కుసంగి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు, మెదక్ మైనార్టీ చైర్మన్ మజర్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు పాపయ్య, సత్యం, మండల ఎస్‌టి సెల్ అధ్యక్షులు సేవాలాల్, ఆయాగ్రామాల సర్పంచులు అవినాష్, ఇర్షద్, మండల నాయకులు చంద్రన్న, బాల్‌రెడ్డి, లక్ష్మణ్, సామెల్, సిద్దు, సుబ్బారావు, నాగయ్య, మల్లేశం, ప్రవీణ్, మహేష్, శ్రీకాంత్‌లున్నారు.

## ఉచిత వైద్య శిబిరం

చిన్నశంకరంపేట, జూన్ 10, ప్రభాతవార్త:

మండల పరిధి రుద్రారంలో బుధవారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. గణేష్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిభిరాన్ని సర్పంచి సంతోష ప్రారంభించారు. సుమారు 100 మందికి పైగా గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి, అవసరం ఉన్నవారికి మందులను అందించారు. కార్యక్రమంలో నవిన్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య సమస్యలు భరించలేక భార్య ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 10, ప్రభాతవార్త:

అనారోగ్యసమస్యలు కారణంగా భార్య ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని అత్మ హత్యకు పాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ పైడి నాయుడు కథనం ప్రకారం..అన్సారి రోడ్డు ప్రాంతానిక చెందిన ఫర్జానాబేగం మూడవ కూతురు రేష్మా (26) మూడు సంవత్సరాలక్రితం షేక్ ముస్తాఫాను ప్రేమవివాహం చేసుకుంది. భార్యాభర్తలిద్దరు లక్ష్మీగూడలోని ఆర్‌జికె భవనంలో ఉంటున్నారు.కాగా గత కొంత కాలం నుంచి రేష్మా బేగం అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ నెల 9వ తేదీన రేష్మా బేగం,భర్త షేక్ ముస్తాఫాలు ఆసుపత్రికి వెళ్లి తొమ్మిది గంటల సమయంలో ఇంటికి వచ్చారు. షేక్ ముస్తాఫా పనిమీద బయటకు వెళ్లగా భార్య రేష్మాబేగం ఇంట్లోని హాల్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈకేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న ధర్మవరం బ్రహ్మం

## వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక శ్రద్ధచూపాలి : మాజీ కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం

**సిద్దిపేట అర్బన్, జూన్ 10, ప్రభాతవార్త** : వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మాజీ కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం అన్నారు. 38వ వార్డులో బుధవారం నిర్వహించిన వార్డుసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్డు సభలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రజల సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. వార్డులో పారిశుధ్య నిర్వహణను సమర్థవంతంగా కొనసాగిస్తున్న శానిటేషన్ కార్మికుల సేవలను సభలో ప్రత్యేకంగా అభినందించారు. వార్డులోని మహిళలు, ప్రజలు వీధి కుక్కలు,కోతుల బెడదతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని సభదృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బ్రహ్మం మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ఫాగింగ్ క్రమం తప్పకుండా చేయాలన్నారు. ప్రజల సహకారంతో భవిష్యత్‌లో వార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు. సభలో మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కల్ గ్రామంలో 'బడిబాట'



బడిబాటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**రాయపోల్, జూన్ 10 (ప్రభాతవార్త):** ప్రైవేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించడం జరుగుతుందని ఎల్కల్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(ఎంపిపిఎస్) ప్రధానోపాధ్యాయులు నాగభూషణం పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం రాయపోల్ మండలంలోని ఎల్కల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధన, ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, అందజేయడంతో పాటు గ్రంథాలయ సదుపాయం, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహ, నరేష్, కరుణాకర్, ఆండాలు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కుమ్మరుల సంఘం దుబ్బాక నియోజకవర్గ కన్వీనర్‌గా నాగరాజు


నియామక పత్రం అందుకుంటున్న కుమ్మరి నాగరాజు

**రాయపోల్, జూన్ 10 (ప్రభాతవార్త):** తెలంగాణ కుమ్మరుల సంఘం దుబ్బాక నియోజకవర్గ కన్వీనర్‌గా రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజును నియమిస్తూ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అమరవాది సారంగపాణి, రాష్ట్ర కన్వీనర్ ఏనుగుతల యాదగిరిలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కుమ్మరుల సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులైన నాగరాజు విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర వ్యవస్థాపకులు ఆకారం మోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కుమ్మరుల న్యాయమైన హక్కుల సాధన కోసం అందుబాటులో ఉండి కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో కుమ్మరులకు తగిన ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రభుత్వంతో కొట్లాడుతామని స్పష్టం చేశారు. అన్ని రంగాలలో వెనుకబాటుకు గురవుతున్న కుమ్మరులను చైతన్యం చేసి గ్రామ గ్రామాన యూత్ కమిటీలు వేసి చైతన్యం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఇందుకు ఆయా గ్రామాల కుమ్మరుల సహాయ సహకారాలతో తమకు న్యాయమైన హక్కుల వాటా కోసం అందరిని చైతన్యం చేసి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. తనకు కమిటీలో పదవి రావడం ఎంతో సంతోషంగా ఉందని, అదే స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామికం : నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, జూన్ 10, ప్రభాతవార్త** : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామికం అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షినటరాజన్ బరిలోకి దిగి నామినేషన్ సమర్పిస్తే బిజెపి కుట్ర పూరితంగా అడ్డుకుని ఎన్నికల కమిషన్ చేత తిరస్కరణకు గురిచేసిందన్నారు. అధికారం చేతిలో ఉందని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తుందని పదవులు ఎప్పటికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ చేస్తున్న అరచాకాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు బొందపెట్టి తీరుతారని హెచ్చరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సిఎం రేవంత్‌రెడ్డిలక్ష్యంగా పెట్టుకుని మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని బిజెపి పగటి కలలుకంటుందన్నారు. తలకిందులుగా తపస్సు చేసినా బిజెపి తెలంగాణలో అధికారంలోకి రాదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తున్న ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సతీష్‌గౌడ్, వహాబ్, రషద్,అర్షద్,హుస్సేన్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

## పశువుల పాక దగ్ధం

**చిన్నశంకరంపేట, జూన్ 10,ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పశువుల పాక దగ్ధమైన సంఘటన మండల పరిధి సంగాయపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న కుమార్ పశువుల పాకలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో పశువుల పాకలో ఉంచిన టార్పాలిన్లు, యూరియా బస్తాలు పూర్తిగా కలిపోయాయి. పాకలో పశువులు లేకపోవడంతో ప్రాణ నష్టం జరుగలేదు. సుమారు 50 వేల రుపాయల ఆస్తి నష్టం జరిగిం దని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

# ధరలు నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మిలిటెంట్ ఉద్యమానికి శ్రీకారం చుడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జాతీయ సమితి పిలుపు మేరకు సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో అల్లాడుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్ర ప్రభుత్వం భారీ ఎత్తున పన్నులు విధించడం వల్ల రవాణా వ్యయం పెరిగి కూరగాయల నుంచి నిర్మాణ సామాగ్రి వరకు అన్ని వస్తువుల ధరలు అకాశాన్నంటుతున్నాయన్నారు. ఒకవైపు నిరుద్యోగం మరోవైపు ధరల భారంతో సామాన్య కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు అంత ఇంత కాదన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు బట్టు దయానందరెడ్డి, యెడల వనేష్, కిష్టాపురం లక్ష్మణ్, జేరిపోతుల జనార్ధన్, రజిని, అజ్మీరా రామ్మూర్తి, శివలింగం, కృష్ణ, రాజేశం, మధు, నరేష్, నర్సింహారెడ్డి, భిక్షపతి, శ్రవణ్,మహేష్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.


మాత్‌పల్లి గ్రామానికి స్టీల్ బ్యాంకును అందజేస్తున్న దృశ్యం

## ప్లాస్టిక్ నిషేదిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం

### సర్పంచ్ బచ్చలి శ్రీలత మహిపాల్

**కొండపాక, జూన్ 10, ప్రభాతవార్త:** ప్లాస్టిక్‌ను నిషేదించి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సర్పంచ్ బచ్చలి శ్రీలత మహిపాల్ గ్రామస్తులను కోరారు. బుధవారం కుకునూరుపల్లి మండల పరిధిలోని మాత్‌పల్లి గ్రామంలో అమె అధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు వాడకంవల్ల ఎన్నో రకాల రోగాలు ప్రబలుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకంవల్ల క్యాన్సర్ వ్యాధిబారిన పడుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్ గ్లాసలల్లో టీ, కాఫీలు తాగడం, ప్లాస్టిక్ ప్లేట్లల్లో వేడివేడి అహార పదర్థాలు తినడంవల్ల మనుషులుఎన్నో ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని వివరించారు. అందరం కలిసికట్టుగా గ్రామంలో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేదిద్దామని ఆమె కోరారు. మాత్‌పల్లి గ్రామంలో ప్లాస్టిక్ నిషేదానికి సహకరించి రూ॥ 50 వేలతో 300 స్టీల్ ప్లేట్లను, 300 స్టీల్ గ్లాసలను అందించి స్టీల్ బ్యాంకు ఏర్పాటుకు సహకరించిన లక్ష్మీమనోహర్‌రావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి సభలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాంప్రసాద్, ఎంఈఒ బచ్చలి సత్తయ్య, ఎంపిఒ నాగభూషం పాల్గొనినమాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగం, కార్యదర్శి రాజేష్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి టీచర్లు కనకవ్వ, మంజుల, ఎఎన్ఎం దేవి నాగలక్ష్మి, ఎఈఒ రమ్య, టిఎ సురేందర్, అశా వర్కర్ లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్ తదితరులు పాల్గొన్నారు అదే విధంగా కోనాయిపల్లి, మేదినిపూర్. మంగోల్ గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. కొండపాక మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి, వెలికట్ట గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. తిమ్మారెడ్డిపల్లి గ్రామసభలో బెల్ట్‌షాపులను నిషిందించాలని మహిళాలుకోరాగా, స్పందించిన సర్పంచ్ కొయ్యడ వెంకటేశం వెంటనే గ్రామసభలో తీర్మానం చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేది వరకు దశల వారిగా గ్రామంలో బెల్ట్‌షాపులను నిషేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఒ మల్లికార్జున్‌రెడ్డి, ఎఒ శివరామకృష్ణ, మిషన్ భగీరథ ఎఈ, వివిధ శాఖల అధికారులు పాల్గొని పలు తీర్మానాలను చేశారు.

## అర్హులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి: టియుడబ్ల్యూజే

**సంగారెడ్డి, జూన్ 10, ప్రభాతవార్త** : సంగారెడ్డిజిల్లాలో మిగిలిన జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజేఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం సంగారెడ్డిలో యూనియన్ జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగింది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యపై, హెల్త్‌కార్డుల అంశంపై చర్చించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించాలని తీర్మానించారు. ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలాఖరులో జిల్లా మహాసభను నిర్వహిస్తామని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎకే ఫైసల్ తెలిపారు. యూనియన్ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి విష్ణుప్రసాద్ సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకె ఫైజల్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సిద్ధన్న పాటిల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా విభాగం అధ్యక్షుడు అనిల్ కుమార్, అక్రమ్ పటేల్, మసూద్ ఖాన్, శ్రీనాథ్, బాసిత్, అన్వర్ హుస్సేన్, హాజీ, మినాజ్, సిద్ధిక్, విష్ణు వర్ధన్, జోగిపేట భూమన్న, యాదగిరి, అబ్దుల్‌మతీన్, విల్సన్, అంజయ్య, సంగమేశ్, వెంకటేష్‌గౌడ్ సిద్దు, రమేష్ గౌడ్, సత్తార్,తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే నాయకులు


రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న పందిల్ల బ్రిడ్జి

## పందిల్లా బ్రిడ్జిపై పెరుగుతున్న ప్రమాదాలు

### హెచ్చరిక బోర్డులు లేక వాహనదారులకు ఇబ్బందులు

**హుస్నాబాద్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త** : హుస్నాబాద్ – సిద్దిపేట జాతీయ రహదారిపైఉన్న పందిల్లా బ్రిడ్జివద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. నెల రోజుల వ్యవధిలోనే ఈ ప్రాంతంలో నాలుగు ప్రమాదాలు సంభవించి ఇద్దరు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు చెబుతున్నారు. జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా వాగుపై నూతన బ్రిడ్జిని నిర్మించారు. అయితే బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత పాత రహదారితో పోలిస్తే కొత్త రహదారి ఎత్తు పెరగడంతోపాటు, బ్రిడ్జి సమీపంలో అవసరమైన హెచ్చరిక సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, వేగ నియంత్రణ సూచనలు ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలకు కారణమవుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో లేదా వర్షాకాలంలో బ్రిడ్జి వద్దకు చేరుకునే వాహనదారులు ముందస్తు హెచ్చరికలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రహదారి మలుపులు, ఎత్తు మార్పులు స్పష్టంగా తెలియక ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సిగ్నల్స్, వేగపరిమితి సూచనలు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గౌరవెల్లిలో పంచాయతీ నిరక్ష్యం..?

### మురికి కాలువలను శుభ్రం చేసుకుంటున్న గ్రామస్తులు

**హుస్నాబాద్ రూరల్/అక్కన్నపేట, జూన్ 10, ప్రభాతవార్త**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ నిరక్ష్యంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్ల ముందు ఉన్న మురికి కాలువలు నిండిపోయి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, క్రిమికీటకాలు పెరిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు పలుమార్లు గ్రామ పంచాయతీ కార్యదర్శికి విన్నవించుకున్నట్లు చెబుతున్నారు. అయితే అధికారులు స్పందించకపోవడంతో చివరకు గ్రామస్తులే స్వయంగా కాలువలను శుభ్రం చేసేందుకు ముందుకొచ్చామని, తమ ఇళ్ల ముందు పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగిస్తూ కాలువలను శుభ్రం చేసిన దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పంచాయతీ బాధ్యత అయినప్పటికీ, ప్రజలే పనులు చేసుకోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని గ్రామస్తులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి మురికి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

## గిర్మాపూర్‌లో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

**వర్గల్, జూన్ 10 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ చిటుకుల విజయలక్ష్మి తన సొంత నిధులతో మరియు గిర్మాపూర్‌లోని వాన్టేజ్ కంపెనీ వారి సహకారంతో ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ హేమలత జ్ఞానేశ్వర్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు చిటుకుల భూమిరెడ్డి, చిటుకుల విష్ణువర్ధన్‌రెడ్డి, వాన్టేజ్ కంపెనీ ప్రతినిధులు మేడిశెట్టి శ్రీనివాస్, చిటుకుల గోవర్ధన్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

## వట్పల్లిలో రైతు ఆత్మహత్యాయత్నం

**వట్పల్లి జూన్ 10 (ప్రభాతవార్త):** సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల కేంద్రంలో బుధవారం రైతు శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో స్థానికంగా తీవ్ర సంచలనం కలిగించింది. తాము సాగు చేసుకుంటున్న భూమి ఇతరుల పేరు ఎలా నమోదు చేస్తారంటూ అధికారుల వైఖరిని నిరసిస్తూ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేయడంతో, స్థానికులు గమనించి ఆ ప్రయత్నాన్ని నివారించారు.


పుష్పగుచ్చం అందజేస్తున్న తోపాజి అనంత కిషన్

## డిఇఓను కలిసిన పిసిసి ప్రధాన కార్యదర్శి

**సంగారెడ్డి బ్యూరో జూన్ 10: ప్రభాతవార్త** : సంగారెడ్డి జిల్లాకు నూతనంగా వచ్చిన జిల్లా విద్యాధికారి రోహిణి ని, తెలంగాణ ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛని అందజేశారు. ఆయన వెంట వాసవి మాత ఆలయ కమిటీ చైర్మన్, సంగారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్ సంఘం ప్రధాన కార్యదర్శి నామా భాస్కర్ గుప్తా మరియు జిల్లా పరిశ్రమల శాఖ సూపరిండెంట్ ఇరుకుల ప్రదీప్ గుప్తా పాల్గొన్నారు.

## యువకులకు క్రీడా సామాగ్రి పంపిణీ

అక్కన్నపేట, జూన్ 10, ప్రభాతవార్త : మండలంలోని యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు యువకులకు క్రీడా సామాగ్రి కిట్లను పంపిణీ చేసినట్లు హుస్నాబాద్ డివిజన్ రైతు ఆత్మ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలను అలవర్చుకోవాలని, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. యువత అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే యువకులకు క్రీడా సామాగ్రి కిట్లను అందించడంలో సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బుర్ర ప్రభాకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు భానోతు వెంకటేష్,అక్కన్నపేట సర్పంచ్ జన్నారపు సంపద వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డుసభ్యులు ఉన్నారు.

## గీతకార్మికులకు రక్షా కిట్ల పంపిణీ

**సిద్దిపేట అర్బన్, జూన్ 10, ప్రభాతవార్త** : జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో బుధవారం సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాలకు చెందిన గీత కార్మికులకు(తాటి తాపర్లకు) 10 కాటమయ్య రక్షా కిట్లను పంపిణీ చేశారు. గీత కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో లబ్దిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్షా కిట్లను తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎ.విజయ్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కృష్ణ దయాసాగర్, బీసీ వెల్ఫేర్ అధికారి రఫీక్, సిబ్బంది సుశాంత్, మనోజ్‌కుమార్ తదిరతులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి : సర్పంచ్


చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ మానస

**కొండపాక, జూన్ 10, ప్రభాతవార్త** : వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రను ప్రతి ఒక్కరు పాటించాలని వెలికట్ట సర్పంచ్ బూర్గుల మానస సురేందర్ అన్నారు. బుధవారం గ్రామంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. అనంతరం ఆమె గ్రామానికి చెందిన చెత్త ట్రాక్టర్‌తో గ్రామంలో తిరిగి ఇంటినుండి వెలువడే 4 రకాల చెత్త గురించిగ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు చెత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు ఇచ్చి స్వచ్ఛ గ్రామపంచాయతీకి సహకరించాలని అమె కోరారు. చెత్త చెదారం రోడ్లవెంట, మురికి కాలువల్లో వేయడంవల్ల అనేక రకాల రోగాలు వస్తాయని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఉప సర్పంచ్ పర్శరాములు, వార్డు సభ్యులు ముత్యంరావు, భాస్కర్, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక


ఉప సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గం ఎన్నికైన దృశ్యం

**కొండపాక, జూన్ 10, ప్రభాతవార్త** : కుకునూరుపల్లి మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గంను కుకునూరుపల్లిలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చింతల నాగరాజు మెదినిపూర్, ఉపాధ్యక్షులు రిప్పాల రమేష్ ముద్దాపూర్, కన్నెమైన రాజు బొబ్బాయిపల్లి, బుర్రి కర్ణాకర్ పిటి వెంకటపూర్, ప్రధాన కార్యదర్శిగా యెల్లు శ్రీనివాస్‌రెడ్డి లకుడారం, సహాయ కార్యదర్శులు దొంతి సత్తయ్య కుకునూరుపల్లి, దబ్బెట నవీన్ రాయవరం, కోశాధికారి శేరుపల్లి లింగం మాత్‌పల్లి, ప్రచార కార్యదర్శి మాసపాక జాని ఎల్లాయగూడెం, సలహాదారు లగిశెట్టి రవీందర్ మంగోల్, కార్యవర్గ సభ్యులు ఈసాల నవీన్, రెడ్డమైన కనకయ్య, దున్నపోతుల సమ్మయ్య, బైరి మల్లేశంను ఏనుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చింతల నాగరాజు మాట్లాతూ ఉప సర్పంచులల్లో సీనియర్ అయిన నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికి అయన కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యప్ప ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శికి సన్మానం

**గజ్వేల్ టౌన్, జూన్ 10 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల గెలుపొందిన అయిత సత్యనారాయణను బుధవారం ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్, సముద్రాల హరినాథ్, రావికంటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా గెలుపొందిన అయిత సత్యనారాయణ సామాజిక సేవా కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొంటూ దైవ కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సందర్భంగా వారికి పదవి రావడం సంతోషంగా ఉందని అన్నారు. అయ్యప్ప ఆలయ కమిటీ నూతన పాలకవర్గానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధి బిక్షపతి, అత్తెల్లి శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షులు కాసం శ్రీనివాస్, ములుగు రంగయ్య, హరికిరణ్, గంగిశెట్టి ఉమేష్, గంగ రమేష్ పాల్గొన్నారు.


అయిత సత్యనారాయణను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నేతలు

# పట్టణ పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి



మాట్లాడుతున్న దండి లక్ష్మి

**హుస్నాబాద్ టౌన్, జూన్ 10, ప్రభాతవార్త**

పట్టణంలో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 3, 5, 8, 17, 19 వార్డుల్లో కౌన్సిలర్ల అధ్యక్షతన వార్డు సభలు నిర్వహించారు. సభలకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి హాజరై ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వార్డు సభల అనంతరం పట్టణంలో రోడ్ల శుభ్రత, డ్రైనేజీల పరిశుభ్రత, మొక్కల నాటకం, దోమల నివారణకు స్ప్రేయింగ్, బ్లీచింగ్ చల్లింపు వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పట్టణ పరిశుభ్రతకు భాగస్వాములు కావాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి పుర పాలక సంఘ వాహనాలకు అందించాలన్నారు. వార్డుల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా 19వ వార్డులో పారిశుధ్య కార్మికుడు ప్రభాకర్ వినూత్న రీతిలో చెత్త విభజనపై అవగాహన కల్పించారు. తడి చెత్త డబ్బాను తలపై ధరించి, తడి చెత్త దేవుడు ఇచ్చిన వరమని, దాని తో సేంద్రియ ఎరువును తయారు చేసి మొక్కలకు ఉపయోగించవచ్చని వివరించారు. అలాగే పొడి చెత్త, రెడ్ కలర్, బ్లాక్ కలర్ డబ్బాలను చేతుల్లో ధరించి చెత్త విభజన ప్రాముఖ్యతను ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేశారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అరికట్టాలని, వాటిని పూర్తిగా నిషేధించాల్సిన అవసరం ఉందని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు కొండ రజిత, బొలిశెట్టి రాజు, కాశబోయిన సరిత, గాదెపాక రవీందర్, బత్తుల స్వరూప, మున్సిపల్ అధికారులు, జవాన్లు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతిప్రణాళికలో ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, జూన్ 10, ప్రభాతవార్త:**
తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 1వవార్డ్ చందాఖాన్‌పల్లి, 8వ మనసున్పూర్ వార్డుల్లో ప్రత్యేకకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్‌కుమార్‌శెట్కార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే, చైర్మన్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులకు పరిష్కారచర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణానికి ప్రతిష్ఠాత్మక రింగ్ రోడ్డును మంజూరు చేయించడంతో పాటు, ప్రతి వార్డులో సిసి రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. వేసవికాలంలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు అమలుచేశామని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ పట్టణ పరిశుభ్రత కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములై తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన పిలుపునిచ్చారు. సర్వే మ్యాపింగ్ ప్రాధాన్యతతో పాటు యువతలో చైతన్యం పెంపొందించేందుకు నిర్వహిస్తున్న అరైవ్-అలైవ్ కార్యక్రమం గురించి కూడా వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాస్పరి ప్రశాంతి, డిఎస్పీ రవీందర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి నూతన్‌కుమార్, ఎస్ఐ శ్రీశైలం, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తాహిర్ అలీ, కౌన్సిలర్లు వివేకానంద, మహేందర్, లక్ష్మణ్, మైతబ్, సురేఖ, షారుఖ్, గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు ముంతాజ్, శెట్టి శంకర్, మొహీద్, నగేష్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డుప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.1.60 కోట్లతో దుగ్గాతండాకు బిటి రోడ్డు


దుగ్గాతండాకు బిటి రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని దుగ్గాతండాకు 1.60 కోట్ల రూపాయలతో బిటి రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఇంతవరకు దుగ్గాతండాకు రోడ్డు సౌకర్యంలేక పడరానిపాట్లుపడ్డ తండావాసులు మండలపరిధిలోని పోట్‌పల్లి నుంచి దుగ్గాతండావరకు బిటి రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పంటల మార్పిడిపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావుపాటిల్

**సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:**
ప్రజలను భాగస్వామ్యం చేసి గ్రామ పంచాయతీ పాలనలో పారదర్శకత పెంచడమే గ్రామసభ ఉద్దేశమని సర్పంచ్ పట్వారి శ్రీనివాసరావుపాటిల్ అన్నారు. మండలకేంద్రమైన సిర్గాపూర్‌లోనిర్వహించిన గ్రామసభకు ఎంపిడిఓ ఆహ్మద్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ హేమంత్‌లు హాజరవగా, సర్పంచ్ గ్రామసభను ఉద్దేశించి మాట్లాడుతూ ఖరీఫ్‌సీజన్‌లో రైతులు పంటలమార్పిడి చేసుకోవాలని సూచించారు. రుతుపవనాల సన్నద్ధత, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణపరిరక్షణపై అధికారులు గ్రామసభలో అవగాహన కల్పించారు.

## సిర్గాపూర్ కార్యదర్శిగా నరసింహాగౌడ్

**సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌గ్రామ పంచాయతీకార్యదర్శిగా నరసింహాగౌడ్ బుధవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు కార్యదర్శిగా విధులు నిర్వహించిన నవీన్‌కుమార్ కంగ్టిమండలం నాగూర్(బి)గ్రామానికి బదిలీ కాగా, వికారాబాద్ జిల్లాలో సేవలు అందించిన నరసింహాగౌడ్ సిర్గాపూర్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ప్రజల, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాభివృద్ధికి తనవంతు సేవలు అందిస్తానని నరసింహాగౌడ్ పేర్కొన్నారు.

## ఇందిర మహిళా స్త్రీశక్తి భవన నిర్మాణానికి శ్రీకారం


ఇందిరా మహిళాస్త్రీశక్తి భవన నిర్మాణానికి శ్రీకారంచుడుతున్న సర్పంచ్

**న్యాల్‌కల్, జూన్ 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని టేకూర్ గ్రామంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇందిరా మహిళాస్త్రీశక్తి భవన నిర్మాణానికి బుధవారం గ్రామ సర్పంచ్ ఎంటూరు సంగీతనాగేశ్వర్ ఉపాధిహామీ ఎపిఓ రంగారావుతో కలిసి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి భవన నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఎపిఓ రంగారావు, ఐకెపి సిసి పుండలీకం, ఎఎన్ఎం ప్రవీణ, అంగన్‌వాడీ టీచర్ శాంతాబాయి. ఆశా వర్కర్ లక్ష్మి, ఉపాధ్యాయులు మైపాల్ నాందేవ్, ఈఏఓ చరణ్, వార్డు సభ్యులు మచ్చేందర్, రుక్యబి శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చిట్కుల్‌లో బడిబాట..


బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం

**చిలిపిచెడ్, జూన్ 10, ప్రభాతవార్త:**
చిలిపిచెడ్ మండలపరిధిలోని చిట్కుల్‌తండా ప్రాథమికపాఠశాలలో బుధవారం బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అశ్విని మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలన్నారు, ప్రభుత్వబడిలో విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, మంచి నాణ్యమైనవిద్య ప్రభుత్వబడిలోనే అందుతుందని సూచించారు, విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంతో పాటు, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంప్‌హౌజ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, జూన్ 10, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గూడూరుగ్రామంలోని పంప్‌హౌస్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పరిశీలించారు. వాటర్‌పంప్ హౌస్‌లో పాత మోటార్లను తొలగించి నూతన మోటార్లు అమర్చడం పూర్తయినందున గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. గూడూరు గ్రామ మంజీర పరివాహప్రాంతంలోని నీటిని ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యేవెంట నాయకులు వెంకట్‌సాగర్, మాజీసర్పంచ్ సునీతప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, జూన్ 10, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండల పరిధిలోని చల్లగిద్ద తాండలో గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీభవానీమాత, సేవాలాల్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనుపమ దంపతులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. వారితోపాటు చల్లగిద్ద తాండ ప్రజలు కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు పెద్ద ఎత్తున ఈవార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

## కాశీపూర్‌లో గ్రామ సభ నిర్వాహణ

**కంది, జూన్ 10, ప్రభాతవార్త:**
ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కాశీపూర్‌లో గ్రామ సర్పంచ్ కృష్ణగౌడ్ అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో పంచాయతీ అవార్డు ప్రైజ్ మనీతో చేపట్టే అభివృద్ధిపనులు, ప్రభుత్వపథకాలు, ఓటరుజాబితా సవరణ, ఎల్‌నినో, వర్షాకాలచర్యలు, సీజనల్‌వ్యాధుల నివారణ, సాగునీరు, విద్యుత్, తాగునీటి సరఫరా, ఎన్ఎఫ్‌బిఎస్ పథకం అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2026 ప్రకారం ఇంటి వద్దనే చెత్తను వేరుచేసి అందించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదని సూచించారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, హరితహారం, పారిశుధ్యం, వర్షపునీటి సంరక్షణ, గ్రామ సౌందర్యీకరణ లాంటి అభివృద్ధి పనులపై ప్రజల సూచనలు స్వీకరించారు. గ్రామాన్ని అదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు బిజెపి నాయకుల సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**నారాయణఖేడ్, జూన్ 10, ప్రభాతవార్త:**
బిజెపి ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన తహసీల్దార్ రాజ్‌పటేల్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు జి.రాజశేఖర్‌గౌడ్, యువమోర్చా అసెంబ్లీ కన్వీనర్ పట్న మాణిక్, మండల అధ్యక్షులు దశరథ్, శ్రీనివాస్, దశరథ్, పూసిన మాణిక్యం, సాయి, సగనాకర్, విశాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం..

**రామాయంపేట, జూన్ 10, ప్రభాతవార్త:**
ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, సమస్యలను అక్కడికక్కడే గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా రామాయంపేట మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రత్యేక వార్డుసభలు ప్రజల్లో మంచి స్పందనను రేకెత్తించాయి. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా రామాయంపేట మున్సిపాలిటీలో ఈనెల 4వ తేదీనుండి విడతలవారీగా ప్రారంభమైన వార్డుసభలు నేటితో పూర్తయ్యాయి. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్యనాగరాజు, మున్సిపల్ కమిషనర్ ఎ.రవీందర్ అధ్యక్షతన 1,6,7 వార్డులకు సంబంధించిన సభలు జరిగాయి. ఈసందర్భంగా వార్డుల అభివృద్ధి పనులు, వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ పోచమ్మల నవనీతగణేష్, వ్యవసాయ అధికారి ప్రవీణ్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, పుట్టి సందీప్, గుగులోతు రవి, జంగంపల్లి శంకర్‌గౌడ్, దేవుని రంజిత్, డాకి శ్యామల, కోఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, గౌస్ పాషా, మున్సిపల్ మేనేజర్ రఘువరన్, మెప్మా ఆర్పీలు మర్కు లావణ్య, రజిత, పి.శ్రీలత, స్వాతి, స్రవంతి, కె.శ్రీలత, ఆర్.లావణ్య, కవిత, తరంగిణి, ఆర్.స్రవంతి, బాల్‌లక్ష్మి, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మోడీ 12 సంవత్సరాల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి

**-బిజెపి మెదక్ జిల్లా నాయకులు కోణం విట్టల్**

**పెద్దశంకరంపేట, జూన్ 10, ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 12 సంవత్సరాల పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్ అన్నారు. బుధవారం మోడీ ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పెద్దశంకరంపేటలోని రామాలయంలో ప్రధానమంత్రి పేరుమీద ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా సంక్షేమం మౌలిక సదుపాయాలు పారిశ్రామిక ప్రగతి పట్టణ అభివృద్ధి రంగాల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు అందించిందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామ పంచాయతీల అభివృద్ధి, పారిశ్రామిక ప్రాజెక్టులకు ప్రోత్సాహం, అర్బన్ డెవలప్‌మెంట్ మౌలికవసతుల అభివృద్ధి చేపట్టడం జరిగిందని వివరించారు. తెలంగాణ ప్రాంతం సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, బిజెవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ, బిజెపి నాయకులు చందుపట్ల అనిల్, శంకర్రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పల్వంచలో జొన్నల కొనుగోలుకేంద్రం


జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**టేక్మాల్, జూన్ 10, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండలపరిధిలోని పల్వంచ చౌరస్తాలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. జొన్నల కొనుగోలు కేంద్రాన్ని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, గ్రామసర్పంచ్ రుక్మిణిబాల్‌రెడ్డిలు ప్రారంభించారు. జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండలంలోని రైతులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.3699లకే కొనుగోలు చేస్తారన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఐసిఎఆర్, ఐఐఎంఆర్ సీనియర్‌సైంటిస్ట్‌లు డాక్టర్ సంగప్ప, డాక్టర్ ఆమసిద్ధ, డాక్టర్ రఫీ, ప్రశాంత్‌లు హాజరై మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే చిరుధాన్యాల సాగుపై సలహాలు అందించారు. రైతులకు చిరుధాన్యాలను ప్రోత్సహించేందుకు జొన్నలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నిమ్మ రమేష్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు సయ్యద్ యూసుఫ్, టేక్మాల్ సర్పంచ్ సుధాకర్, మాజీ మండల కో ఆప్షన్ మజాహర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, గ్రామాల సర్పంచులు, రైతుసంఘం డైరెక్టర్లు, పిఎసిఎస్ డైరెక్టర్లు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమైక్య సంఘ భవనానికి భూమిపూజ

**నిజాంపేట్, జూన్ 10, ప్రభాతవార్త:**
నిజాంపేట్ మండలం రాంరెడ్డీపేట్లో మహిళా సమైక్య సంఘ భవనానికి బుధవారం మార్కౌట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సంగ్రామ్, పంచాయతీరాజ్ అధికారి విద్యాసాగర్ పాల్గొన్నారు. అనంతరం ఎంపిడివో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్మిస్తున్న మహిళాసంఘ భవనాలు మహిళా సాధికారతకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర్, ఉపసర్పంచ్ సాయిలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**మనూర్, జూన్ 10, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని తోర్నాల్‌లో కొలువున్న శ్రీపోచమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి అంబేద్కర్ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి భవన సముదాయాన్ని పరిశీలించి అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు తమవంతు కృషిచేయాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన భవనంలో గ్రామపాలన, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని పోచమ్మతల్లిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సంగమేశ్వర్‌పాటిల్, నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు గంపల సిద్దారెడ్డి, మాజీఎంపిటిసిసభ్యులు పండరిరెడ్డి, మాజీసర్పంచ్ సంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున్‌పటేల్, అంబేద్కర్ యువజనసంఘం నాయకులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలి..

**-ఎస్ఐకు బిజెపి కౌన్సిలర్ శంకర్‌గౌడ్ వినతి**


ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ శంకర్‌గౌడ్

**రామాయంపేట, జూన్ 10, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలోని వివేకానంద సర్కిల్ నుంచి సిద్దిపేట రోడ్డు వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న బజాజ్‌షోరూం ఎదుట ప్రమాద హెచ్చరిక సూచికలు, వేగనియంత్రణ బోర్డులు ఏర్పాటుచేయాలని బిజెపి కౌన్సిలర్ జంగంపల్లి శంకర్‌గౌడ్ పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం రామాయంపేట సబ్‌ఇన్స్పెక్టర్ నరేష్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, బజాజ్‌షోరూం సమీపంలో గత రెండునెలలుగా డ్రైనేజీసమస్య కారణంగా రోడ్డు మరమ్మతుపనులు కొనసాగుతున్నాయి. దీంతో ఆప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతోపాటు ప్రమాదాల ముప్పు నెలకొంది. రోడ్డు మరమ్మతులు జరుగుతున్న ప్రాంతానికి కొంతదూరం ముందుగానే ప్రమాద హెచ్చరిక బోర్డులు, వేగనియంత్రణ సూచికలు ఏర్పాటుచేస్తే వాహనదారులు అప్రమత్తమై ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. అవసరమైతే ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కూడా చేపట్టాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## కళాశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు

**రామాయంపేట, జూన్ 10, ప్రభాతవార్త:**
రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలు అందించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి చెప్పారు. బుధవారం కళాశాలలో చేరిన విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలప్రకాష్, ఆంజనేయులు, బాబురావు, యాదగిరి, సురేందర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, సాయికుమార్ విద్యార్థులు ఉన్నారు.

## తాగి వాహనాలు నడపొద్దు

**-సిఐ వెంకట్‌రెడ్డి**


రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సిఐ వెంకట్‌రెడ్డి

**సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:**
వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని సిఐ వెంకట్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో సిఐ వెంకట్‌రెడ్డి పాల్గొని ప్రజలకు పలుసూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వ్యక్తుల కుటుంబాలు రోడ్డుపాలవుతాయని, అందుకు మద్యంసేవించి వాహనాలు నడపకుండా రోడ్డు నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సిఐ వెంకట్‌రెడ్డి సూచించారు.

## బాలికలకు హెచ్‌సివి వ్యాక్సిన్ వేయించాలి

**-డాక్టర్ తరణి**

**నిజాంపేట్, జూన్ 10, ప్రభాతవార్త:**
నిజాంపేట్ మండలపరిధి గ్రామాల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం 14,15 ఏళ్ల బాబాలికలకు హెచ్‌సివివ్యాక్సిన్ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. హెచ్‌సివి వ్యాక్సిన్ ప్రాణాంతక వ్యాధులను సమర్థవంతంగా నివారించడంలో సహాయపడుతుందని, రోగనిరోధకశక్తిని పెంచుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులో హెచ్‌సివి వ్యాక్సిన్ల టీకాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని సూచించారు.

## పల్లెల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి

**-ఎంపిడిఓ శంకర్**

**చౌటకూరు, జూన్ 10, ప్రభాతవార్త:**
పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఓ శంకర్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని తాడ్దానిపల్లిలో ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఓ శంకర్ మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా తమకు అందచేసిన రెండు బుట్టల్లోనే తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందచేయాలని సూచించారు. పంటసాగు విధానం, పంటలమార్పిడి, వాతావరణ పరిస్థితులు, పారిశుధ్యం, ఇంకుడుగుంతలు, వీధిదీపాలు, ముళ్లచెట్ల తొలగింపు, రక్షితతాగునీరు, జలసంరక్షణ, మనసంరక్షణ, వన మహోత్సవం, ఎస్ఐఆర్, శిశురక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో నయాబ్ తహసీల్దార్ సూరేపల్లి అనుదీప్, సర్పంచ్ పామోనోల్ల అంజమ్మ, ఉపసర్పంచ్ మౌలాన, జిపిఓ ఈశ్వర్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

## మద్యం విక్రయిస్తే రూ.50వేల జరిమానా..

**-పట్టిస్తే రూ.5వేల బహుమానం**


గ్రామ సభలో పాల్గొన్న అధికారులు

**పెద్దశంకరంపేట, జూన్ 10, ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేట మండలంలోని రామోజిపల్లి గ్రామంలో మద్యం విక్రయాలను పూర్తిగా నియంత్రించేందుకు గ్రామసభ కీలకనిర్ణయం తీసుకుంది. మంగళవారం గ్రామ సర్పంచ్ దంతెల జయశీల అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటుచేశారు. గ్రామంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహించినట్లు నిర్ధారణ అయితే వారికి రూ.50వేల జరిమానా విధించాలని గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. గ్రామంలో శాంతిభద్రతలు, కుటుంబసంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ దంతేల జయశీల తెలిపారు. రామోజిపల్లిని మద్యరహితగ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులందరూ సహకరించాలని ఆమె కోరారు. గ్రామపెద్దలు, మహిళాసంఘాల సభ్యులు, యువకులు ఈ తీర్మానాన్ని స్వాగతించారు. అదేవిధంగా గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లు ఆధారాలతోసహా గుర్తించి సమాచారం అందించిన వ్యక్తికి రూ.5వేల నగదు బహుమానం అందజేయనున్నట్లు గ్రామ సభ వెల్లడించింది. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ చారిత్రాత్మక పాలన..

**-రామాయంపేటలో బిజెపి సంబరాలు..**

**రామాయంపేట, జూన్ 10, ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతదేశ ప్రధానుల్లో అత్యధికకాలం పదవిలో కొనసాగిన నేతల జాబితాలో 4,399 రోజుల పాలన పూర్తిచేసి చారిత్రాత్మక మైలురాయిని అధిగమించడంపై రామాయంపేట బిజెపి నాయకులు బుధవారం హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మెదక్ చౌరస్తాలో మోడీ చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షులు నవీన్‌గౌడ్, స్థానిక కౌన్సిలర్ జంగంపల్లి శంకర్‌గౌడ్, సర్పంచ్‌లు యాదగిరి, బాలరాజ్, ఉపసర్పంచ్ ప్రశాంత్, సీనియర్ నాయకులు దోమకొండ రాములు, భానుచందర్, దయానందరెడ్డి, యువ జననాయకుడు మరుకు వెంకటి, మండల ప్రధాన కార్యదర్శి సాదుల నాగరాజు, ఓబిసి మోర్చా నాయకులు నవాత్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# డంప్ యార్డ్‌కు శాశ్వతపరిష్కారం దిశగా అడుగులు

**-రామాయంపేటలో బయోమైనింగ్ ప్రక్రియకు శ్రీకారం**
**-వారంరోజుల్లో నివేదిక సమర్పించనున్న సృష్టి కాంటెక్ సంస్థ**


రామాయంపేట డంపుయార్డును పరిశీలిస్తున్న అధికారులు

**రామాయంపేట, జూన్ 10, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని డంప్ యార్డ్‌లో సంవత్సరాలుగా పేరుకుపోయిన లెగసీ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు మునిసిపాలిటీ అధికారులు చర్యలు ప్రారంభించారు. బయోమైనింగ్ ప్రక్రియ అమలుకు తొలి అడుగుగా బుధవారం మునిసిపల్ కమిషనర్ ఎ.రవీందర్ ఆధ్వర్యంలో డంప్‌యార్డ్‌లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ పరిశీలనలో బయోమైనింగ్ పనులను చేపట్టనున్న సృష్టి కాంటెక్ సంస్థప్రతినిధి సుమిత్ పాల్గొన్నారు. డంప్‌యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త పరిమాణం, వ్యర్థాల స్వభావం, విస్తీర్ణం, పరిసరాలపై పడుతున్న ప్రభావం వంటి అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. డంప్‌యార్డ్‌లో ఉన్న లెగసీ వ్యర్థాల కచ్చితమైన పరిమాణాన్ని నిర్ధారించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన డ్రోన్ కెమెరా సహాయంతో వైమానిక చిత్రాలు, వీడియోలను సేకరించారు. వీటి ఆధారంగా డంప్ యార్డ్‌కు సంబంధించిన సమగ్ర అంచనా రూపొందించనున్నారు. ఈ సందర్భంగా సృష్టి కాంటెక్ సంస్థప్రతినిధులు మాట్లాడుతూ, డంప్‌యార్డ్‌కు సంబంధించిన లెగసీ వెస్ట్ అసెస్‌మెంట్ రిపోర్టును వారంరోజుల్లో మున్సిపాలిటీకి అందజేస్తామని తెలిపారు. నివేదిక ఆధారంగా బయోమైనింగ్ పనులను ప్రారంభించి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో వేరుచేసి పునర్వినియోగం చేయడంతోపాటు మిగిలిన వ్యర్థాలను శాశ్వతంగా నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మునిసిపల్ కమిషనర్ ఎ.రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బయోమైనింగ్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేసి డంప్‌యార్డ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తొలగించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బయోమైనింగ్ పూర్తయిన అనంతరం డంప్‌యార్డ్ ప్రాంతం పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా మారడంతో పాటు కాలుష్య సమస్యలు తగ్గి ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతోమేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్.వనిత, మునిసిపల్ శానిటేషన్ సిబ్బంది, సృష్టి కాంటెక్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.